క్లుప్తంగా

రోడ్డు ప్రమాద మృతుల్లో యువతే అధికం

నరసరావుపేట రూరల్: రహదారి ప్రమాదాల్లో యువతే అధికంగా మృతి చెందుతున్నారని జిల్లా రవాణా అధికారి పరంధామరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పెట్లూరివారిపాలెం లోని ఏఎం రెడ్డి ఫార్మసీ కళాశాలలో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాహన చోదకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని కోరారు. చట్టాలు ప్రజల రక్షణ కోసమే అని, వాటిని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ప్రసాద్ ప్రమాదాలకు గల కారణాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రావ్య, కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి, ప్రిన్సిపాల్ భార్గవ్ భూషణ్ పాల్గొన్నారు.

జాతీయ యువజనోత్సవంలో నరసరావుపేట విద్యార్థి



నరసరావుపేట రూరల్: నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల సీఎస్‌ఈ నాల్గవ సంవత్సరం విద్యార్థి శనపతి అక్షయ్‌కుమార్ మహారాష్ట్రలో నిర్వహించిన 27వ జాతీయ యువజనోత్సవాల్లో పాల్గొన్నట్టు కళాశాల వైస్‌చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి శనివారం తెలిపారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో వారం రోజుల పాటు నిర్వహించిన యువజనోత్సవంలో 28 రాష్ట్రాలు, ఎనిమిది కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి జాతీయ వేదికపై తమ జిల్లా సంస్కృతి, సాంప్రదాయలను ప్రదర్శించేందుకు యువతను ఎంపికచేసినట్టు తెలిపారు. విజయనగరం జిల్లాకు చెందిన అక్షయ్‌కుమార్ ఈ ఫెస్టివేల్‌కు ఎంపికై తమ జిల్లాకు ప్రాతినిధ్యం వహించారని వివరించారు. విద్యార్థి అక్షయ్‌కుమార్‌ను కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, కార్యదర్శి, పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్ బాబు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసకుమార్, సియస్‌ఈ విభాగాధిపతి డాక్టర్ ఎస్ఎన్ తిరుమలరావు, అధ్యాపకులు అభినందించారు.

జంగాలపల్లెలో చోరీ

నాదెండ్ల: ఇంట్లో ఎవరూ లేరన్న సంగతి తెలుసుకున్న దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన జంగాలపల్లె గ్రామంలో శనివారం వెలుగులోకొచ్చింది. ఎస్సై జె.బలరామ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన కటకం శౌరిరెడ్డి దంపతులు వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటారు. వీరి కుమారుడు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. కొద్దిరోజుల క్రితం ఇంటికి తాళం వేసి దంపతులు ఇరువురూ కుమారుని వద్దకు వెళ్ళారు. ఈ నెల 1న ఇంటికి చేరుకున్నారు. అప్పటికే ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న రూ.50 వేల నగదు, 8.9 గ్రాముల బంగారు ఆభరణాలు, సుమారు కిలో వెండి అపహరణకు గురైనట్లు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ

బొల్లాపల్లి: మండలంలోని పేరూరపాడు గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కార్డులు శని వారం పంపిణీ చేశారు. ఆరోగ్య శ్రీ పరిధిలో సంవత్సరానికి రూ.25 లక్షల వరకు కుటుంబ సభ్యులు వైద్యఖర్చుల నిమిత్తం వినియోగించుకోవచ్చని వెల్లటూరు పీహెచ్‌సీ వైద్యాధికారి పి.కృష్ణానాయక్ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పాండురంగారావు, ఏఎన్ఎం రాణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బంది నిరసన

నాదెండ్ల: విశాఖ జిల్లా తహసీల్దార్ రమణయ్య హత్యకు నిరసనగా శనివారం నాదెండ్ల మండల రెవెన్యూ సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ సానపల్లి రమణయ్యను గుర్తుతెలియని వ్యక్తులు కొట్టి చంపిన విషయం విదితమే. నాదెండ్ల మండల డీటీ అనురాధ, సర్వేయర్ శ్రీనివాసరావు, జేఏ నరహరి, సీవో వాసు, సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు నల్ల బ్యాడ్జీలు ధరించి కార్యాలయం ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు.

అసిస్ట్‌లో మెగా జాబ్‌మేళా

చిలకలూరిపేట టౌన్: ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ అసిస్ట్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు మెగా జాబ్ మేళా శనివారం నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో 10 కంపెనీలు పాల్గొన్నాయి. 250 మంది నిరుద్యోగులు హాజరవ్వగా, 160 మంది వివిధ కంపెనీల్లో ఎంపికైనట్లు అసిస్ట్ డైరెక్టర్ జాష్టి రంగారావు చెప్పారు. ఎంపికైన వారికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేట్ డైరెక్టర్లు జె.కృష్ణహరీష్, జె.విష్ణుప్రియ, మూర్తి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

పరిమితికి మించి ఎక్కిస్తే చర్యలు తప్పవు

చిలకలూరిపేట టౌన్: ఆటో డ్రైవర్లు తమ వాహనాల్లో పరిమితికి మించి ప్యాసింజర్లను ఎక్కిస్తే చట్టబద్ధమైన చర్యలు తప్పవని చిలకలూరిపేట మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ టీవీ నాగలక్ష్మి పేర్కొన్నారు. 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని ఆటో అసోసియేషన్ డ్రైవర్స్‌కు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రోడ్డు నిబంధనలను పాటిస్తూ, వాహన లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయడం, సిగ్నల్స్‌ను జంపింగ్, మైనర్లకు వాహనాలు ఇవ్వడం వంటివి చేయరాదన్నారు.

జగనన్న సారథ్యంలోనే గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- తిమ్మాయపాలెంలో అభివృద్ధి కార్యక్రమాలు ఆరంభం



గ్రామ సచివాలయ శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): గ్రామ పరిపాలన వ్యవస్థను తీసుకొచ్చి గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేశారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. వినుకొండ రూరల్ మండలంలోని తిమ్మాయపాలెంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ సెంటర్‌ల నూతన భవనాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి చేయాలనే ఆలోచనకు గ్రామ ప్రజలు సహకరించాలని తెలిపారు. అలా కాకుండా అభివృద్ధికి అడ్డుకట్ట వేయాలని చూస్తే మనకే నష్టం అని అన్నారు. ముఖ్యమంత్రి చొరవతోనే ఇక్కడ ఇలా శాశ్వత కట్టడాలతో గ్రామపరిపాలన వచ్చిందని గుర్తుచేశారు. చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో పరిపాలన చేస్తున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని అన్నారు. టీడీపీ అధికారంలో ఉన్న 14 సంవత్సరాల్లో చేసిన అభివృద్ధి అభివృద్ధి ఏమిటో చెప్పమని అడిగితే ఆ ప్రశ్నకు సమాధానం లేదని అన్నారు. నవరత్న పథకాల ద్వారా ప్రతి కుటుంబం లబ్ధి పొందిందని తెలిపారు. అభివృద్ధి చేయడం చేతకాక ఎల్లో మీడియా ద్వారా టీడీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఇక్కడ ఉన్న బురిడి బాబా జీవీ ఆంజనేయులు కూడా 10 సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉన్నా అభివృద్ధి ఎక్కడా కానరాని పరిస్థితి, పట్టణంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ కోట్లు దోచుకుని ప్రజలకు బిందెల సంస్కృతిని జీవీ తీసుకొచ్చారన్నారు. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బిందెల సంస్కృతికి చరమగీతం పాడి 70 ఎకరాలు ఉన్న సింగర చెరువును 272 ఎకరాలుగా విస్తరణ చేసి మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ నాగరాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దండు చెన్నయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, ఎంపీపీ పగడాల జయశ్రీ వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ విజయలక్ష్మి రాజా, మాజీ ఎంపీపీ ములకా రామతులసిరెడ్డి, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టం అతిక్రమిస్తే కఠిన చర్యలు

జిల్లా కలెక్టర్ శివశంకర్



నరసరావుపేట: లింగ నిర్ధారణ చట్టం–1994ను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ ఆథారిటీ, జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సంయుక్త సమావేశం శనివారం నిర్వహించారు. కమిటీ సభ్యులతో మాట్లాడుతూ జిల్లాలో లింగ నిర్ధారణ చట్టం 1994ను సమర్థంగా అమలు చేయాలని అన్నారు. ఈ చట్టం పరిధిని ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ చేయుట చట్టరీత్యా నేరమని, ఆపని చేసినట్లు రుజువైతే చట్టపరిధిలో శిక్షార్హులవుతారని హెచ్చరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 161 ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రులు లింగ నిర్ధారణ చట్టం పరిధి కింద అనుమతులు ఇచ్చినట్లు చెప్పారు. జిల్లాలో నూతనంగా నాలుగు స్కాన్ సెంటర్లకు, 10 రెన్యువల్స్‌కు, తొమ్మిది మార్పుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి లింగ నిర్ధారణ చట్టం కింద అనుమతులు మంజూరు చేశామన్నారు. డీఎండీహెచ్‌దో డాక్టర్ బి.రవి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ బి.గీతాంజలి, డీసీహెచ్ఎస్ డాక్టర్ రంగారావు, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యురాలు డాక్టర్ ఎం.వసంతకిరణ్, అదనపు ఎస్పీ రవిచంద్ర, ఎఫ్‌డీపీ నోడల్ అధికారి డాక్టర్ హనుమకుమార్, సత్తెనపల్లి గైనకాలజిస్ట్ ఏ శోభారాణి, డాక్టర్ గిరిరాజు, మాచర్ల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చార్లెస్ వెస్లీ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఏలూరు సునీత



మాట్లాడుతున్న ఏలూరు సునీత

నరసరావుపేట రూరల్: విద్యార్థి దశ నుంచే వినియోగదారుల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఏలూరు సునీత తెలిపారు. జొన్నలగడ్డలోని సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో వినియోగదారుల చట్టాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సునీత, జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ లక్ష్మీనారాయణలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వస్తువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని తెలిపారు. వ్యాపారులు మోసం చేసినట్టు గమనిస్తూ టోల్ ఫ్రీ నెంబర్ 1915కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. మోసాలకు పాల్పడే వ్యాపారులపై వినియోగదారుల కమిషన్‌లో కేసు నమోదు చేసి నష్టపరిహారం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏంజెల్ ఫ్రెడ్ కంజ్యూమర్ రైట్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు పిలి యజ్ఞనారాయణ, మండల విజిలెన్స్ కమిటీ సభ్యుడు షేక్ షాముల్ల, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే సమాఖ్య ఆర్థిక పురోగతి

ఎంపీపీ పిడతల ఝాన్సీ



మాట్లాడుతున్న ఎంపీపీ పి.ఝాన్సీ

యడ్లపాడు: మహిళా సమాఖ్యలు ఆర్థిక పురోగాభివృద్ధిని సాధించాలంటే.. వాటిని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు సమన్వయ కృషి అవసరమని ఎంపీపీ పిడతల ఝాన్సీ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో యడ్లపాడు మండల సమాఖ్య 15వ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో రాబోయే ఆర్థిక సంవత్సరంలో ఆరోగ్యం, విద్య, పరిసరాల పరిశుభ్రత, పురుగు మందులు లేని వ్యవసాయంపై అవగాహన పెంచుకునే కార్యాచరణ చేపట్టాలని సభ్యులు చర్చించారు. ముందుగా సమాఖ్య అధ్యక్షులు ఆర్ సెల్వి మండల సమైక్య 2022–23 ఆర్థిక సంవత్సరం వివరాలను వెల్లడించారు. సమాఖ్య నికర ఆదాయం రూ.5,33,681 ఉందన్నారు. సమావేశంలో స్త్రీనిధి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె హనుమాన్ నాయక్, ఏజీఎం ఆర్.బుల్లయ్య, గ్రామసంఘ, సమాఖ్య పాలకవర్గ సభ్యులు, వీవోఏలు, ఏపీఎం జీవన్, సీసీలు నాగేశ్వరరావు, హేమలత, పేరమ్మ పాల్గొన్నారు.

బాలల రాజ్యాంగం పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు

నాదెండ్ల: గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు రచించిన బాలల రాజ్యాంగం అనే పుస్తకాన్ని విద్యార్థులకు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కాపు వెంకటరావు మాట్లాడుతూ, నియోజకవర్గ స్థాయిలో ఇప్పటికి వెయ్యి పుస్తకాలకు పైగా పదో తరగతి విద్యార్థులకు పంపిణీ చేశామన్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 200 మందికి అందించినట్లు తెలిపారు. చిన్నతనం నుంచే విద్యార్థులకు భారత రాజ్యాంగంపై అవగాహన అవసరమని, హక్కులు, విధులు, ఓటు హక్కు తదితర విషయాలను అర్థం చేసుకోవాలన్నారు. తద్వారా సాంఘిక శాస్త్ర పరీక్షల్లో మంచి విజయాలు సాధిస్తారన్నారు. కార్యక్రమంలో క్లబ్ మాజీ అధ్యక్షులు తోటకూర వెంకట నారాయణ, హెచ్ఎం కృష్ణానాయక్, ఉపాధ్యాయుల కోటేశ్వరరావు, బాజీబాబు, రసూల్, నరేష్‌నాయక్ పాల్గొన్నారు.

బైపాస్‌కు గోడల నిర్మాణాన్ని నిలిపివేయాలి

నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహనరావు

నాదెండ్ల: నేషనల్ హైవే 16– చిలకలూరిపేట బైపాస్ రోడ్డుకు ఇరువైపులా గోడలు నిర్మించటం వల్ల రైతాంగం తీవ్ర సమస్యలు ఎదుర్కొంటారని నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహనరావు చెప్పారు. గణపవరం గ్రామంలో శనివారం బైపాస్‌కు ఇరువైపులా భూములున్న రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తిమ్మాపురం – తాతపూడి వరకూ 16 కిలోమీటర్ల పొడవున చిలకలూరిపేట బైపాస్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, బైపాస్‌కు ఇరువైపులా ఉన్న సర్వీసు రోడ్లకు గోడలు నిర్మాణంతో రైతులు సమస్యలు ఎదుర్కొంటారన్నారు. ఈ గోడల నిర్మాణం వల్ల రైతులు భూముల్లో వ్యవసాయ పనులకు రాకపోకలు సాగించేందుకు పంట ఉత్పత్తులు తరలించేందుకు ఇబ్బందులు పడతారన్నారు. వర్షాకాలంలో వర్షపు నీరు పంట పొలాల్లో నిలిచి పంటలు దెబ్బతినే అవకాశం ఉందన్నారు.

దీనిపై ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం రైతాంగ సమస్యలను దృష్టిలో ఉంచుకుని గోడల నిర్మాణ పనులు నిలిపివేయాలని, అవసరమైతే నేషనల్ హైవే అధికారులతో సంప్రదించి రైతు సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు, వడ్లమూడి శ్రీకాంత్, నరసింహారావు, జంపని సుబ్బారావు, సిద్దిక్, బొప్పూడి అంజమ్మ, రైతాంగం పాల్గొన్నారు.

రేపు జేఎన్‌టీయూలో ప్రారంభోత్సవాలు

నరసరావుపేట రూరల్: కాకానిలోని జేఎన్‌టీయూ నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల క్యాంపస్‌లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలను ఈనెల 5వ తేదీ సోమవారం నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.హెచ్. శ్రీనివాసరావు తెలిపారు. కళాశాలలోని అకడమిక్ బ్లాక్, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, సీసీ రోడ్లు ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, జలవనరుల శాఖామంత్రి అంబటి రాంబాబు, వైద్య ఆరోగ్య శాఖామంత్రి విడదల రజని, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రా రెడ్డి, వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రసాదరాజు తదితరులు పాల్గొంటారని తెలిపారు.

సకాలంలో ఇళ్ల రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి



మాట్లాడుతున్న కమిషనర్ గోవిందరావు

చిలకలూరిపేటటౌన్: నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు జారీచేసిన ఇంటి పట్టాలను త్వరితగతిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు చెప్పారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాలులో వార్డు అడ్మిన్లతో పేదలందరికీ ఇళ్లు కార్యక్రమ రిజిస్ట్రేషన్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్ల పథకం ద్వారా ఇళ్ల పట్టాలు అందజేసినట్లు చెప్పారు. లబ్ధిదారులు వారి ఇళ్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి సచివాలయ అడ్మిన్‌ను సంప్రదించాలని సూచించారు. ఆస్తి, నీటి పన్నులను సకాలంలో చెల్లించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి కె.సునీత పాల్గొన్నారు.

టెన్నికాయిట్ రాష్ట్రస్థాయి పోటీలకు బొప్పూడి విద్యార్థులు



చిలకలూరిపేటటౌన్: విద్యార్థులు క్రీడల్లో విశేష ప్రతిభ చూపడం అభినందనీయమని బొప్పూడి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం బొప్పూడి వెంకటేశ్వర్లు చెప్పారు. శనివారం మండలంలోని బొప్పూడి గ్రామంలో హైస్కూల్‌లో విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులు ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. కార్యక్రమంలో పీడీ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ప్రాణాలు తీసిన ఆన్‌లైన్ ఆటలు!

ఈపూరు: ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని యర్రగుంట తండా సమీపంలోని అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. యర్రగుంట తండాకు చెందిన రామావత్తు బాలస్వామి నాయక్ (20) వినుకొండలోని ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. గత నెల 26వ తేదీన పొలం వెళ్లిన బాలస్వామి నాయక్ ఇంటికి వెళ్తున్నట్లు తండ్రి శ్రీరాములు నాయక్‌తో చెప్పి వచ్చాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులుకు బాలస్వామి నాయక్ కనిపించలేదు. బంధువుల ఇళ్ల వద్ద, కళాశాలలో, స్నేహితులను ఆరా తీయగా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి శ్రీరాములు నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అడవిలో వెతుకుతుండగా బాలస్వామి మృతదేహం చెట్టుకు వేలాడుతూ కనిపించింది. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలస్వామి నాయక్ ఆన్‌లైన్ బెట్టింగ్‌లు ఆడటం వల్ల అప్పుల పాలైనట్లు బంధువులు తెలిపారు. అప్పు చెల్లించాలని ఇంటికి కొందరు యువకులు వచ్చినట్లు శ్రీరాములు నాయక్ తెలియజేశాడు. మృతుడి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్‌కే మహమ్మద్ ఫిరోజ్ తెలిపారు.

కాలనీల అభివృద్ధిపై దృష్టిసారించాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు



కాలనీలో సమస్యల్ని తెలుసుకుంటున్న రాజేష్ నాయుడు, షేక్ రఫాని

చిలకలూరిపేటటౌన్: శివారు కాలనీల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని కౌన్సిలర్ మానుకొండ మాధవీలత, అధికారులతో కలిసి శనివారం పట్టణంలోని 11వ వార్డు క్రీస్తుకాలనీ, రూత్ డైక్‌మెన్ నగర్ ప్రాంతాలను ఆయన సందర్శించారు. ఆయా కాలనీల్లోని వీధుల్లో తిరుగుతూ స్థానికుల సమస్యల్ని తెలుసుకున్నారు. మురుగు కాల్వలు, సబ్‌స్టేషన్ వద్ద పూర్తిగా ధ్వంసమైన కల్వర్టు, తదితర సమస్యల్ని వారి దృష్టికి తెచ్చారు. వెంటనే ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న నవరత్న సంక్షేమ ఫలాలు అందరికీ అందుతున్నాయా లేవా అని ప్రజలను అడిగి తెలుసుకోగా అందరికీ వస్తున్నాయంటూ వారంతా వెల్లడించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, డీఈఈ తోట వెంకటరమణ, వైఎస్సార్ సీపీ నాయకులు నాయకులు కల్లి వెంకటరెడ్డి, మానుకొండ అక్కిరెడ్డి, శేషిరెడ్డి, శ్రీనివాసరెడ్డి పంగులూరి వెంగళరాయుడు, సాతులూరి కోటి, వడ్లాన అలెగ్జాండర్, దార్ల ఏలియా, పబ్బతి దాసు, ఏలిషా, చుక్కా డేవిడ్, చిన్నా, కల్లి శ్రీనివాసరెడ్డి, బైకా వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కుస్తీ పోటీలకు కేబీఆర్ విద్యార్థి



జాతీయస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైన సన్నీని అభినందిస్తున్న ప్రిన్సిపల్ నాగిరెడ్డి

నరసరావుపేట ఈస్ట్: జాతీయస్థాయి కుస్తీ (రెజ్లింగ్) పోటీలకు కాసు బ్రహ్మానందరెడ్డి కళాశాల విద్యార్థి ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ సి.హెచ్.వి.నాగిరెడ్డి శనివారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రకాశంజిల్లా టంగుటూరు మండలం జమ్ములపాలెంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలలో తమ విద్యార్థి టి.సన్నీ అండర్–20 (63 కేజీలు) విభాగంలో బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని వివరించారు. మధ్యప్రదేశ్‌లో ఈ నెల 11వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జరగనున్న జాతీయస్థాయి కుస్తీ పోటీలలో సన్నీ ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. సన్నీని కళాశాల కార్యదర్శి, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ప్రిన్సిపల్ నాగిరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎ.వెంకట శివ, పీడీ ఎం.వినీల్, అధ్యాపకులు అభినందించారు.

రాష్ట్ర మహిళా క్రికెట్ పోటీలకు పల్నాడు జట్టు



జట్టును అభినందిస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎంపీడీవో జాకీర్ హుస్సేన్

నాదెండ్ల: ఆడుదాం ఆంధ్రా మహిళా విభాగం క్రికెట్ పోటీల్లో జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని నరసరావుపేటలో జరిగిన కార్యక్రమంలో జట్టు సభ్యులను జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ మొదటి బహుమతిని అందించారు. విజయం సాధించిన జట్టు ఫిబ్రవరి రెండో వారంలో విశాఖ పట్టణంలో జరిగే పోటీల్లో పల్నాడు జిల్లా జట్టు పాల్గొననున్నది.

జిల్లాస్థాయిలో జరిగిన పోటీల్లో ఈ జట్టు నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. నియోజకవర్గ స్థాయిలో గెలిచిన జట్టుకు రూ.35 వేలు, రాష్ట్ర జట్టుకు ఎంపికైన టీంకు రూ.60 వేలు నగదు వారి ఖాతాలకు జమకానున్నాయి. క్రీడాకారులను కలెక్టర్ అభినందిస్తూ త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి జట్టులో కూడా విజయం సాధించి పల్నాడు జిల్లాకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాదెండ్ల మండల ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్, ఆడుదాం ఆంధ్రా క్రీడా కన్వీనర్ కె.వి.నాగరాజు పాల్గొన్నారు.

ముఖాలు పాతవి.. కండువాలే కొత్తవి!!

- వారంతా సొంత పార్టీ మనుషులే.. కొత్త చేరికలంటూ టీడీపీ కండువాలు!
- కౌన్సిలర్లు, నాయకులు ఎద్దేవా



మాట్లాడుతున్న కౌన్సిలర్లు, 25వ వార్డు ప్రజలు

చిలకలూరిపేట/యడ్లపాడు: టీడీపీ కుట్రలు, కుతంత్రాలు ఇకపై చెల్లవని...వారి మోసపూరిత మాటలు నమ్మే పరిస్థితిలో చిలకలూరిపేట ప్రజలు లేరని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు తోట నాగలక్ష్మి, అన్నపరెడ్డి శ్రీలక్ష్మి, చెమిటిగంటి పార్వతిదేవి, షేక్ ఖాజాభాను పేర్కొన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 25వ వార్డు ప్రజలతో కలిసి శనివారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రానున్న ఎన్నికల్లో తిరిగి ఆపార్టీకి బుద్ధి చెప్పేందుకు.. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా మల్లెల రాజేష్ నాయుడిని అఖండ విజయం చేకూర్చేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నా రని స్పష్టం చేశారు. 25వ వార్డులో ఇటీవల మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు సతీమణి వెంకాయమ్మ సమావేశం ఏర్పాటు చేసి సొంతపార్టీ వారికి కండువాలు కప్పి టీడీపీలోకి చేరారంటూ ప్రకటించారని ఎద్దేవా చేశారు. ప్రజలను మభ్యపెట్టి మోసం చేయడంలో టీడీపీది దిట్ట అన్న విషయం మరోమారు బహిర్గతమైందన్నారు. వార్డులో తమ పార్టీ శ్రేణుల్ని తిరగనియ్యమని హెచ్చరించడం టీడీపీ అరాచక సంస్కృతికి అద్దం పడుతుందన్నారు.

25వ వార్డు పాటిమీద సీసీరోడ్డు వేయిస్తామంటూ మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఇచ్చిన హామీని నెరవేర్చలేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రూ.30 లక్షలతో దీర్ఘకాలికంగా ఉన్న ఆ సమస్యను నెరవేర్చామన్న విషయాన్ని గుర్తు చేశారు. అన్నపరెడ్డి వారికి కమ్యూనిటీ హాలు నిర్మిస్తామంటూ తెచ్చిన రూ.7 లక్షల నిధులు ఏమాయ్యాయని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఇర్రి రాఘవ, తోట వెంకటసురేష్, జయలక్ష్మి, గండవరపు పార్వతి, తాటి సుబ్బాయమ్మ, భాగ్యలక్ష్మి, బి.శాంతిసుధ, గొట్టిపాటి అంజమ్మ, ఎం హిమబిందు, షేక్ ఖాదర్, చింతా రవి, ఇంటూరి శివనాగేశ్వరరావు, గజేంద్ర ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

చకచకా ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్ పనులు



శావల్యాపురం గ్రామ సచివాలయంలో వివరాలు నమోదు చేస్తున్న వీఆర్వో రాధ

శావల్యాపురం: నవరత్నాల పథకాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఇంటి నివేశిత పట్టాలు రిజిస్ట్రేషన్ పనులు శరవేగంగా జరుగుతున్నట్లు తహసీల్దారు వేముల వెంకట నాగరాజు తెలిపారు. శనివారం ఆయన సదరు వివరాలు వెల్లడించారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాలు ఉండగా 1286 మంది లబ్ధిదారులు సమగ్ర వివరాలతో కూడిన రిజిస్ట్రేషను పనులు చేపడుతున్నామన్నారు. సచివాలయ స్థాయిలో పంచాయతీ కార్యదర్శి సబ్ రిజస్టర్, వీఆర్వో ఏస్యూటెంట్, లబ్ధిదారుడు క్రైమాంట్ విధివిధానాలు ప్రభుత్వ నిబంధనలు మేరకు లబ్ధిదారులకు అందజేసిన ఇంటి పట్టాలను ఆన్‌లైన్‌లో సమగ్ర వివరాలతో పాటు లబ్ధిదారుల బయోమెట్రిక్ కూడా నమోదు చేస్తున్నట్లు తెలిపారు. 9వ తేదీ తుది గడువన్నారు. అనంతరం శావల్యాపురం గ్రామ సచివాలయంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆయనతో పాటు డెప్యూటీ తహసీల్దారు పేరిసోముల నాసరయ్య, పంచాయతీ కార్యదర్శి మహేంద్ర, వీఆర్వో ఆర్.రాధ తదితరులు పాల్గొన్నారు.